ఘనంగా శ్రమదాన్ దివస్



రామంతాపూర్: వెంకట్‌రెడ్డినగర్ ఫేవికాల్ ఛాంపియన్ క్లబ్ అధ్యక్షుడు చెల్లోజు ఎల్లాచారి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శ్రమదాన్ దివస్ పేరిట ఫేవికాల్ ఛాంపియన్ క్లబ్ సభ్యులు స్కూల్‌లోని విరిగిపోయిన బెంచీలు, కుర్చీలు, కిటికీలు, తలుపులకు మరమ్మతులు చేశారు. కార్యక్రమంలో బ్రహ్మాచారి, శ్రీకాంత్‌చారి, అనిల్‌చారి, సుధాకర్‌చారి, ఫిరోజ్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

యేసు బోధనలు ఆచరణీయం



రామంతాపూర్: అరోరా(అటానమస్) పీజీ కళాశాలలో బుధవారం నిర్వహించిన క్రిస్మస్ సంబరాల్లో విద్యార్థులు యేసుక్రీస్తు జననం నాటికను ప్రదర్శించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.మాధవి మాట్లాడుతూ యేసుక్రీస్తు బోధనలు ఆచరణీయమన్నారు. క్రిస్మస్ పండగ సహనం, మానవత్వం ప్రాముఖ్యతను తెలియజేస్తుందని పేర్కొన్నారు. డాక్టర్ సీహెచ్ సతీష్ కుమార్, దేవేందర్‌రావు పాల్గొన్నారు.

నాణ్యత విషయంలో రాజీవద్దు



వార్డు కార్యాలయం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: నాచారం వార్డు కార్యాలయం నిర్మాణ పనులను బుధవారం జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిగతా రెండు ఫ్లోర్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వార్డు కార్యాలయానికి లిఫ్ట్ సౌకర్యం ఉండేలా చూడాలన్నారు. రూ.78 లక్షలతో నిర్మిస్తున్న వార్డు కార్యాలయం మిగతా డివిజన్లకు ఆదర్శంగా ఉండాలన్నారు. ఎక్కడా నాణ్యత విషయంలో రాజీపడొద్దన్నారు. పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈ రూప, ఏఈ లింగారావు, బీఆర్‌ఎస్ సీనియర్ నేత నెమలికొండ భూపాల్‌రెడ్డి, తుంగ తిరుపతి, రామకృష్ణ, కట్ట బుచ్చన్నగౌడ్, నర్సింగ్‌రావు, సాయిబాబా, ప్రేమ్ కుమార్, భాను, గణేష్, సాయి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అధిరులకు సూచించారు. బుధవారం ఓల్డ్ మల్లాపూర్‌లోని సంజీవయ్య పార్క్ వద్ద రూ.13 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పన, ప్రజా సంక్షేమానికి మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీఈ రూప, ఏఈ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, స్థానిక నేతలు వాసుగౌడ్, వై.మల్లేష్, ప్రకాష్, నర్సింగ్‌రావు, రాపోలు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి



చిలుకానగర్‌లో సమస్యలను చూపుతున్న కార్పొరేటర్ బన్నాల గీత

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లోని సీవరేజ్, ప్రధాన రహదారి బాక్స్ కల్వర్టు పనులను వేగవంతం చేయాలని జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులను స్థానిక కార్పొరేటర్ బన్నాలగీత ప్రవీణ్ ముదిరాజ్ కోరారు. ఈ మేరకు బుధవారం డివిజన్‌లో అధికారులతో కలిసి పర్యటించి స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. పెండింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ నిఖిల్ రెడ్డి, ఏఈ సత్యనారాయణ, ఏఈ రాజ్‌కుమార్, బీఆర్‌ఎస్ నేత బన్నాల ప్రవీణ్, కొండల్‌రెడ్డి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. చర్లపల్లి డివిజన్ సాయినగర్ కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ఆమె అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో మాట్లాడారు. కాలనీ సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కారించుకోవాలన్నారు. అభివృద్ధి పనులు చేసే క్రమంలో స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈ స్వరూప, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, కాలనీ అధ్యక్షుడు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

'నయా'జోష్.. పోలీస్ నజర్..

న్యూఇయర్ సెలబ్రేషన్స్ అనగానే వివిధ జిల్లాల్లోని యువత సైతం నగరం వైపు చూస్తారు. సెలబ్రేషన్స్ కోసం ప్రత్యేకంగా ఈవెంట్స్ ఏర్పాటు చేసి సెలబ్రిటీలను ఆహ్వానించి ఉత్సాహం నింపుతారు. దీంతో పలు ప్రాంతాల నుంచి యువత పెద్దఎత్తున హాజరై ఎంజాయ్ చేస్తుంటారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో సైతం సెలబ్రేషన్స్ ఉండటంతో సంఘవిద్రోహ శక్తులు ఆయా ప్రాంతాల్లో తమ కార్యకలాపాలు కొనసాగించేందుకు సిద్ధం అవుతుండగా పోలీసులు వారిపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఎప్పటికప్పుడు వారి కదలికలను గమనిస్తూ కటకటాల్లోకి పంపిస్తున్నారు. – ఉప్పల్



గంజాయిని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు(ఫైల్)

సంతోషంలో విషాదం నిండకుండా ఉండేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక కసరత్తు చేస్తోంది. నయాసాల్ సంబురాలపై నజర్ పెట్టింది. ఇప్పటికే రాష్ట్ర బార్డర్లలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసిన తనిఖీలను ముమ్మరం చేసి పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. నేరగాళ్ల గుండెల్లో గుబులు పుట్టించేలా, మాదకద్రవ్యాలను సరఫరా చేస్తున్న వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతున్నారు. ఇప్పటికే గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచి వందలాది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను జైలుకు పంపారు. ఓ పక్క లా అండ్ ఆర్డర్ పోలీసులు, మరోపక్క ఎక్సైజ్ పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సంఘ విద్రోహశక్తులను వేటాడుతున్నారు.

ఈ ఏడాది 349 కేసులు నమోదు

ఉప్పల్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ సంవత్సరం 349 కేసులను బుక్ చేసినట్లు సీఐ చంద్రశేఖర్ గౌడ్ వెల్లడించారు. 142 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. 120 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీటితో పాటు అక్రమంగా రవాణా చేస్తున్న 26,439 లీటర్ల కల్లును స్వాధీనం చేసుకుని నిందితులను జైలుకు పంపించినట్లు వివరించారు.

నెల రోజుల్లోనే.. రికార్డు స్థాయిలో..

ఈ సంవత్సరంలో ఒక నెల రోజుల వ్యవధిలోనే ఉప్పల్, మల్కాజిగిరి, ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో అక్రమంగా మద్యం విక్రయించే వారిపై 255 కేసులు నమోదు చేసినట్లు, 76 మందిని అరెస్టు చేసి రూ.2,56,00,000 విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. దీంతో పాటు 16 గంజాయి కేసుల్లో 19 మందిని అరెస్టు చేసి వారి నుంచి దాదాపు 112 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రూ.30 లక్షల విలువ చేసే ఆరు లీటర్ల హష్ ఆయిల్‌ను సీజ్ చేసినట్లు అధికారులు ప్రకటించారు.

నయా సాల్ వేడుకలపై ఆంక్షలు..

నూతన సంవత్సర వేడుకల్లో ఎలాంటి అపశ్రుతులు జరగకుండా ఉండే విధంగా పోలీసులు వేడుకలపై ఆంక్షలు విధించారు. రాత్రి ఒంటి గంట వరకే వేడుకలకు అనుమతి ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో దొరికితే ఇంతే సంగతులు అంటున్నారు.

సంఘ విద్రోహశక్తులపై ప్రత్యేక నిఘా



డ్రగ్‌ఫ్రీ రాష్ట్రంగా చేసేందుకు తెలంగాణ పోలీస్ లక్ష్యంగా పని చేస్తున్నాం. నూతన సంవత్సర వేడుకల్లో అపశ్రుతులు జరగకుండా ఉత్సవాలను జరుపుకోవాలి. ముఖ్యంగా యువత పెడదారి పట్టకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. గ్రూపులుగా ఈవెంట్ చేసుకునే వారు విధిగా పోలీసుల అనుమతి తీసుకోవాలి. సంఘ విద్రోహశక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. ఇప్పటికే అన్ని చెక్‌పోస్టులను అప్రమత్తం చేస్తున్నాం. పాత నేరస్తులు, గంజాయి విక్రేతలు, జైలు నుంచి వచ్చిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచాం.

– చంద్రశేఖర్, మల్కాజిగిరి డివిజన్ ఏసీపీ

ప్రత్యేక టీంల పర్యవేక్షణలో..



ఈ సంవత్సరం చాలా వరకు గంజాయి విక్రేతలను అరికట్టాం. ప్రత్యేక నిఘా వ్యవస్థల ద్వారా మూలాలను కనిపెట్టి పెద్ద ఎత్తున గంజాయి, హష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నాం. కొత్త సంవత్సరం వేడుకలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. పెద్ద ఎత్తున మాదకద్రవ్యాల క్రయవిక్రయాలపై నిఘా ఏర్పాటు చేశాం. అసలు సూత్రదారులను కట్టడి చేసేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఈవెంట్లు చేసుకునే వారు తప్పని సరిగా అనుమతి తీసుకోవాలి. లేదంటే కేసులను నమోదు చేస్తాం.

– చంద్రశేఖర్ గౌడ్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్

గేటు.. పాట్లు..

- రైల్వే క్రాసింగ్ వద్ద నిత్యం ఇబ్బందులు
- నిత్యం పదుల సంఖ్యలో రైళ్ల రాకపోకలు
- అధిక సమయం నిరీక్షిస్తున్న ప్రయాణికులు
- పలుమార్లు పెద్దఎత్తున ట్రాఫిక్ జామ్
- ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు



గౌతంనగర్: గౌతంనగర్ వాసులకు రైల్వే క్రాసింగ్ వద్ద నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదు. రోజు రోజుకూ జనాభా పెరుగుతుండటంతో పాటు నిత్యం వేలాది వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. రైల్వే గేట్ల వద్ద రెడ్ సిగ్నల్ పడితే వాహనదారుల అవస్థలు వర్ణనాతీతం. రాకపోకలు సాగిస్తున్న సమయంలో గేటు పడటంతో ఎక్కువ సమయం వృథా అవుతుందని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి సమస్య ఉన్నప్పటికీ పరిష్కారానికి ఇంత వరకు ఎవరూ ముందుకు రాకపోవడంపై వాహనదారులు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

108, ఫైర్ ఇంజిన్ రావాలంటే..

మల్కాజిగిరి రైల్వే స్టేషన్ నుంచి ప్రస్తుతం వందల సంఖ్యలో ప్రతిరోజూ రైళ్లు రాకపోకలు సాగిస్తుండటంతో రైల్వే గేటు పడిన సమయంలో వాహనదారులు చాలా సేపు ఎదురు చూడాల్సి వస్తోంది. తరచూ గేటుపడుతుండటంతో వాహనదారులకు సమయం వృథా అవడంతో పాటు ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. అత్యవసరమైన 108, ఫైర్ ఇంజిన్ వంటి వాహనాలు రావాలంటే గేటు పడే సమయంలో ఇబ్బందికరంగా మారుతోందని పలువురు అంటున్నారు.

కార్యాలయాలకు ఆలస్యంగా..

జంట నగరాల్లో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో పనిచేసే ప్రజలు వందలాది మంది ఇక్కడే నివాసం ఉంటారు. కార్యాలయాలకు వచ్చి పోయేటప్పుడు ఆలస్యంగా చేరుకుంటున్నామని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యామ్నాయ దారిలేకపోవడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. దానికి తోడు పాఠశాల, కళాశాల విద్యార్థులు కూడా నిత్యం అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా రైల్వే గేటు వద్ద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని వేడుకుంటున్నారు.

మంత్రికి అభినందనలు



కుషాయిగూడ: రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు పోలేపాక అంజయ్య, అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు, పోలగాని శ్రావణ్‌కుమార్‌గౌడ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయనను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

పైపులైన్, డ్రైనేజీ నిర్మాణ పనుల కోసం సర్వే



అల్వాల్: అల్వాల్ సర్కిల్ పరిధిలోని ఎంహెచ్‌ఆర్ కాలనీలో మంజీరా లైన్, డ్రైనేజీ నిర్మాణం కోసం జలమండలి మేనేజర్ రమేష్ సర్వే చేశారు. త్వరలో పైపులైన్, డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు సంతోష్‌రెడ్డి, కృష్ణ, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం

కుషాయిగూడ: గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చర్లపల్లి పారిశ్రామికవాడ ఫేస్–1లో సుమారు 60 సంవత్సరాల వయసు కలిగిన ఓ వృద్ధుడు రోడ్డు పక్కన పడిపోయి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా అప్పటికే మృతిచెందాడు. ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వ్యక్తులు చర్లపల్లి పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

సీఎంకు శుభాకాంక్షలు



అల్వాల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షులు విక్రమ్‌గౌడ్‌తో పాటు జాజుల శ్రీనివాస్ కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బీసీ ఉద్యమంలో అనేకసార్లు ప్రత్యక్షంగా పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పాత జ్ఞాపకాలను గుర్తుచేశామన్నారు. అతి త్వరలోనే అన్ని సమస్యల పరిష్కానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు విక్రమ్‌గౌడ్ తెలిపారు.

ఘనంగా బాలాజీ బ్రహ్మోత్సవాలు



అల్వాల్: అల్వాల్‌లోని బాలాజీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని అల్వాల్ పురవీధుల్లో పల్లకీ సేవ ద్వారా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు సామాజికవేత్తలు వెంకటరామిరెడ్డి, శివకృష్ణ, సురేందర్ రెడ్డి, రాము, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు అయ్యప్ప స్వాములు



గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ సాయినగర్ సాయిబాబా ఆలయం నుండి హన్మంతరావు గురుస్వామి ఆధ్వర్యంలో బుధవారం పలువురు అయ్యప్ప స్వాములు శబరిమలకు తరలివెళ్లారు.

ప్రతిభను గుర్తించేందుకే స్మార్ట్ ఇండియా హ్యాకథాన్



ఎంపిక చేసిన సమస్యను సాధించే పనిలో నిమగ్నమైన విద్యార్థి బృందాలు

పోచారం: విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ఏఐసీటీఈ, భారత విద్యామంత్రిత్వ శాఖల సౌజన్యంతో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ నిర్వహించారు. యంనంపేట్‌లోని శ్రీనిధి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(స్నిస్ట్)లో రెండు రోజుల పాటు సాగిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్–2023 గ్రాండ్‌ఫినాలే బుధవారం ముగిసింది. ఇంజినీరింగ్ విద్యార్థుల్లో కొత్త ఆలోచనలను ప్రోత్సహించేందుకు హ్యాకథాన్ ముఖ్య ఉద్దేశ్యమని అధ్యాపకులు చెప్పారు. దేశంలోని ప్రముఖ విద్యాసంస్థలకు చెందిన 200 మంది విద్యార్థులు, 40 మంది మెంటర్స్(మార్గదర్శకులు), 15 జ్యూరీ బృందాల(న్యాయనిర్ణేతలు) భాగస్వామ్యంతో కార్యక్రమం విజయవంతమైంది. అందుకు శ్రీనిధి వేదిక కావడంపై కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. కార్యక్రమంలో స్నిస్ట్ డైరెక్టర్ ప్రొ.సీవీ టోమీ, ప్రిన్సిపాల్ డా.టీసీహెచ్ శివారెడ్డి, ఇన్నోవేషన్ డీన్ డా.శృతి భార్గవ చౌబే తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో ఆటోడ్రైవర్ల ర్యాలీ

మేడ్చల్: మహాలక్ష్మీ పథకంలో భాగంగా ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణంపై ఆంక్షలు పెట్టాలని ఆటో డ్రైవర్లు కోరారు. ఈ సందర్భంగా మేడ్చల్‌లో వివిధ ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్లు వ్యాపారాలు లేక ఇల్లు గడవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పథకాన్ని రద్దు చేయాలని, లేనిపక్షంలో డ్రైవర్లకు రోజువారిగా రూ.వెయ్యి భృతి చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో వివిధ యూనియన్ల ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం

మేడ్చల్‌రూరల్: గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని మునీరాబాద్ గ్రామ సర్పంచ్ చిట్టిమిల్ల గణేశ్ తెలిపారు. బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. సభలో గ్రామంలోని సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించారు. ఆదర్శ గ్రామంగా అవార్డు పొందిన గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. సమావేశంలో ఉపసర్పంచ్ నర్సింగ్‌రావు, అధికారులు, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల భోజనంలో నాణ్యత ఉండాలి

కీసర: విద్యార్థులకు నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందజేయాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. నిర్వాహకులతో మాట్లాడి విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనానికి సంబంధించిన మెనూ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఈ సీజన్‌లో మెనూ ప్రకారం వేడివేడిగా మధ్యాహ్న భోజనాన్ని అందజేయాలన్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని అన్నారు.

వసతులను సద్వినియోగం చేసుకోవాలి

- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్
- నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో తనిఖీలు
- బస్తీ దవాఖానాలో రికార్డుల పరిశీలన
- మునిసిపల్ అధికారులతో సమీక్ష



ప్రగతినగర్‌లో పార్కులో మొక్కలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ గౌతమ్



నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయంలో..

నిజాంపేట్: ప్రభుత్వం ప్రజల కోసం ఏర్పాటు చేసి వసతులను సద్వినియోగం చేసుకున్నప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని, మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. బుధవారం ఆయన నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పర్యటించారు. ఈ సందర్భంగా పార్కులు, బస్తీ దవాఖానాలను సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ముందుగా ప్రగతి నగర్ పరిధిలో ఉన్న పార్కులను సందర్శించిన కలెక్టర్ గౌతమ్ పార్కులో మొక్కలు, వాకింగ్ ట్రాక్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అదే ప్రాంతంలో ఉన్న క్రీడా మైదానాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి ప్రజలకు మంచి ఆరోగ్యం కల్పించడంతో పాటు వారికి అన్ని రకాలుగా సౌకర్యవంతంగా ఉండేలా అర్బన్ పార్కులను ఏర్పాటు చేసిందన్నారు.

బస్తీ దవాఖానా తనిఖీ

ప్రగతినగర్లో బస్తీ దవాఖానాను జిల్లా కలెక్టర్ గౌతమ్ అకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రికి వచ్చిన పలువురు రోగులను పలకరించి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్యం కోసం వచ్చే ప్రజలతో సిబ్బంది ఆత్మీయంగా మాట్లాడాలని, అప్పుడే ప్రజలకు వైద్యుల పట్ల గౌరవం పెరుగుతుందన్నారు. అనంతరం ఆసుపత్రిలోని రికార్డులు, రిజిష్టర్లు, మందులకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. ఆసుపత్రి స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి అవసరమైన మందులను తెప్పించుకోవాలని వైద్యాధికారిని ఆదేశించారు. ల్యాబ్‌లో డయాగ్నస్టిక్‌కు సంబంధించి వస్తున్న రోజువారి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మున్సిపల్ అధికారులతో సమీక్ష..

నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్‌లో జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆయా విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ మరింత అభివృద్ధి చెందేందుకు అందరి సహకారం అవసరమన్నారు. సకాలంలో మున్సిపల్ టాక్స్‌లు వసూలయ్యేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా మున్సిపల్ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు తగినన్ని నిధులు సమకూరతామన్నారు. పార్కులు, రోడ్లు, డ్రైనేజీ తదితర ముఖ్య వసతులను ఎప్పటికప్పుడు మెరుగు పరచాలని, ప్రజలకు అన్ని సౌకర్యాలను కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సమావేశంలో నిజాంపేట మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, బాచుపల్లి తహశిల్దార్ పుల్ సింగ్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.